# మనుషులు - మమతలు

నల్లూరి వసుంధర

వీధి గుమ్మానికి జారగిలబడి వేపచెట్టు మీదున్న కాకి గూటిపై మనసును, దృష్టిని కేంద్రీకరించడం తన దినచర్యలో ముఖ్యమైన అంశంగా మార్చుకుంది సుభద్రమ్మ.

నిన్న మొన్నటి వరకు, కిచ, కిచమంటూ గోలచేసే కాకి పిల్లలతో, పచ్చ, పచ్చగా వున్న గూడు ఈనాడు బోసిగా, శూన్యంగా వెలవెలబోతూ, పడిపోవడానికి సిద్ధంగా వున్న తన పాత కొంపలా వుందనిపించింది. కారణాన్ని తేలిగ్గానే వూహించగలిగింది తల్లి హృదయం. కావు, కావు మంటూ గూటి చుట్టూ ఎగురుతూ తన మనసులోని, ఆవేదనను వెళ్ళబోసుకుంటుంది కాబోలు ఆ తల్లి కాకి, మనుష్యులకు అర్థంకాని భాషలో భారంగా నిట్టూర్చింది సుభద్రమ్మ.

రెక్కలు రాగానే కాకిపిల్లలు నిర్దాక్షిణ్యంగా తల్లిని, గూటినివదలి క్రొత్త నెలవు వెతుక్కుంటూ పోతాయి. తల్లిపడే ఆవేదన, ఆరాటంతో వాటికి పని ఏముంది? సృష్టిలోని రహస్యమిదే కాబోలు! తన ఆలోచనకు పిచ్చిగా నవ్వుకుంది సుభద్రమ్మ.

అంతలో దగ్గుతెర రావడంతో ఉక్కిరిబిక్కిరైంది. దగ్గుతోబాటు చిమ్మిన రక్తాన్ని చూసి రోజులు దగ్గరపడుతున్నాయని తృప్తి పడింది. దడ దడ లాడే గుండెతో, రక్తమాంసాలు కరువై కట్టెలా ఎండిన శరీరాన్ని ఎలాగో, అడుగులు తడబడుతూ వుంటే వెల్లకిలా వున్న మంచపు కుక్కిపైకి చేరింది.

తనగోడు వినడానికి, తనకు ఓదార్చడానికి ఎవరున్నారు. రేపటిమీద మనిషికి ఎంతటి ఆశ. తన బ్రతుక్కి అర్థం, పరమార్థం అంటూ ఏమిలేదని గ్రహించినా, తనవునికి ఎవరికీ అవసరం కాదనే నిజం యేనాడో తెలిసినా, ఆత్మహత్యకు పాల్పడలేక యాంత్రికంగా, గమ్యం లేకుండా ప్రయాణం చేసే బాటసారిలా కాలాన్ని దొర్లించసాగింది సుభద్రమ్మ.

వంశాన్ని ఉద్ధరించడం ఎలా తగలడినా, తమకు జన్మనిచ్చిన తల్లి బ్రతికినన్నాళ్ళు తిండి పెట్టాలనే తలపే లేని మానవాధములైన సుపుత్రులు తనకున్నారనే సత్యాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని ప్రయత్నించి విఫలురాలైంది సుభద్రమ్మ. కన్నతల్లి వున్నదో, పూడిందో .... తెలుసుకోవాలనే జిజ్ఞాసలేని పిరికివాళ్ళు ఒకరు అన్యాయాన్ని యెదిరించి న్యాయాన్ని నిలిపే న్యాయమూర్తి పదవిలో వున్నారు. మరొకరు దేశసుభిక్షం కోసం శ్రమించే ఇంజనీరు. వీరికి జన్మనిచ్చిన తల్లి మాత్రం అనాథ. నిర్భాగ్యురాలు.

మూల గూట్లో నున్న దీపం చమురు లేక మృత్యుముఖంలో నున్న రోగిలా కొట్టుకలాడ సాగింది. ఆ దీపాన్ని చూస్తుంటే సుభద్రమ్మకు గతం కళ్ళముందు నిలచినట్లయింది.

* * *

తైలం వున్నంత వరకే దీపం అఖండంగా వెలుగుతుంది, తగ్గినప్పుడు [illegible]

తక్షణ ఆరిపోతుంది. ఈ కోవకు చెందిన వాడే సుభద్రమ్మ భర్త సీతారామయ్య. చేతిలో డబ్బులాడి నన్నాళ్ళూ రోజుల్ని జల్సాగా, విలాసంగా గడిపేశాడు. అందిన సుఖాలన్నిటినీ చవిచూసి, చేయగలిగినన్ని అప్పులు చేసి చేతిలో ఎర్ర పైగానిలేని అదను చూసి, గత్యంతరము లేక, బిడ్డలను వారి కర్మకు వదిలి బావిలో గుటు చప్పుడు గాకుండా దూకేశాడు. సుభద్రమ్మకు మిగిలినది పడి పోవడానికి సిద్ధంగా వున్న కొంప మాత్రమే.

ఓ శుభ ముహూర్తాన 'పుణ్యాత్ముడొ'కడు ప్రాంసరీనోటు చూపించి ఆ వొక్క ఆధారాన్ని స్వంతం చేసుకొని నిలువ నీడలేకుండా చేశాడు.

మంచి యవ్వనంలో అందంగా వున్న సుభద్రమ్మకు కాలాన్ని వెళ్ళదీయటం దుర్లభమైంది. అటు అత్తవారి తరపు వారు గాని, ఇటు పుట్టింటి వైపు వారు గాని, వీరి స్థితిని చూసి పోషణ చేసేవారే కానీ, జాలి పడే వారే లేకపోయారు. విధిలిఖితం. బిడ్డలిద్దరిని, పొట్టకు కరిపించుకొని స్వంతవూరు వదలి కనబడిన రైలెక్కి ఎన్నడూ చూసి ఎరుగని వూరిలోదిగింది. పనికోసం వూరంతా తిరిగింది. కాళ్ళరిగినా కడుపునిండే మార్గం కనబడలేదు. పని ఇస్తామంటూ పిలచిన పెద్ద మనుష్యులందరూ సుభద్రమ్మ కేసి విషపు చూపులు చూడసాగారు. పరిస్థితులను ఆకళింపు చేసుకున్న సుభద్రమ్మ ఆ చూపుల ధాటికి తట్టుకోలేక, పొట్టలు నింపుకొనే మార్గము అన్వేషించలేక నిస్సహాయ స్థితిలో ఘోరున విలపించ సాగింది.

స్పృహలేని పసివానిని వొడిలోవుంచుకొని దిక్కు, దెస తోచక, ఎవరినీ యాచించి ప్రయోజనము లేక పిచ్చిచూపులు చూస్తున్న సుభద్రమ్మను, ఆపద్బాంధవునిలా ఘూషయ్య ఆదుకొన్నాడు. వారి మంచి, చెడ్డలను విచారించాడు. తన స్నేహితుడైన కంట్రాక్టరుతో చెప్పి సుభద్రమ్మకు కూలిపని ఇప్పించాడు. తన కడుపు నిండినా, నిండకపోయినా బిడ్డల కడుపులను నింపసాగిందా కన్నతల్లి.

పిల్లల శ్రేయస్సును కోరి, పెద్దవాడిని పెంపకానికి ఇప్పించడానికి, ఘూషయ్య, సుభద్రమ్మను వొప్పించడానికి ఎంతో అవస్థ పడవలసి వచ్చింది. కుమిలిపోయే మనసును అదిమిపెట్టి రేయింబవళ్ళు ఆలోచించి ఒక్కడైనా సుఖపడతాడు లెమ్మని, కొడుకును వారి చేతుల్లో పెట్టింది. వారివ్వబోయిన ప్రతిఫలాన్నికూడా తిరస్కరించింది సుభద్రమ్మ.

కలవారి ఇంట పెద్దబాబు, దొరబాబులా పెరగసాగాడు. ఆ ఐశ్వర్యము కొన్ని రోజులకు కన్నతల్లినే మరపించింది. క్రొత్తలో తల్లిని చూస్తూనే రివ్వున చేతుల్లో వ్రాలే పెద్దబాబు రాను, రాను తల్లికి దూరంగా మసల సాగాడు. ఈ మార్పుకు సుభద్రమ్మలోని మాతృ హృదయము విల విలలాడసాగింది

ఒకవైపున చిన్నవాడి వెతలు చూస్తూనే వున్నది గదా. చాలీచాలని తిండితో, అనారోగ్యంగా వుండేవాడు తను ఏడవటం తప్ప యేం చేయగలదు? ఖరీదైన జీవితం గడుపుతున్న పెదబాబును చూస్తూంటే కడుపు నిండినట్లుండేది సుభద్రమ్మకు అటి పరిస్థితులలో. పెదబాబుకు, తమ్ముడు, తల్లి దూరంగా వుంటేనే మంచిదనుకొని చిన్నవాడిని తీసికొని దూరంగా పారిపోయి వచ్చేసింది.

తాను ఇళ్ళలో పాచిపని చేసుకుంటూ, నోటి మంచితనంతో, పిల్లవాడికి, వారాలు ఏర్పాటు చేసుకొని చదివించుకో సాగింది. తండ్రి లక్షణాలు సుపుత్రులిద్దరికీ వంశపారంపర్యంగా సంక్రమించినట్లే, చిన బాబు కు చదువు అబ్బినా, సంస్కారము దూరంగానే వుండిపోయింది. వయసు పెరిగే కొలదీ అమ్మకు దూరం కాసాగాడు. జల్సాగా, విలాసంగా జీవితాన్ని గడపాలని, పెద్ద చదువులు చదవాలని ఆరాట పడసాగాడు.

తల్లిమాటను గడ్డిపరక క్రింద జమకట్టి లక్ష్యపెట్టేవాడు కాదు. తన కార్యసాధనకు అనేక మార్గాలను అన్వేషించేవాడు. ఇంకేముంది. కలిసివచ్చిన అవకాశాలను వృథా పోనివ్వక, అందమైన బంగారు పిచ్చుకను వలలోకి లాగి, గుట్టురట్టు కాకుండా, పెళ్ళి తంతు కాస్తా తల్లికి తెలియకుండానే ముగించుకున్నాడు. ఆ అడ్డు తొలగించుకోగానే, తల్లిని వదలి తనదారి తాను చూసుకున్నాడు. గొప్పింటి అల్లుడయ్యాడు. కూలీ, నాలీ చేసుకుంటూ కాలాన్ని లాగుతున్న సుభద్రమ్మను, కాబోయే ఇంజనీరుగారి తల్లి అని చెప్పుకోవాలంటే సిగ్గుపడే పరిస్థితి కొచ్చాడు చినబాబు. కాలమహిమ అన్నిటినీ కళ్ళతో చూస్తూ, చెవులతో వింటూ మౌనంగా వుండిపోయింది సుభద్రమ్మ.

న్యాయమూర్తి పట్టా పుచ్చుకున్న పెదబాబు తల్లిప్రేమతో బాటు తల్లి రూపాన్ని కూడా మనోఫలకం పైనుండి పూర్తిగా తుడిచివేశాడు. ఆడంబరం, పైపై మెరుగులు గౌరవ జీవితానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా భావించే వారికి ఆత్మీయులతో పని ఏముంటుంది. హృదయమే లేనప్పుడు మమతలను కూడా గుర్తించలేరు.

వారికి దూరంగా మూరుమూల ఒంటరిగా, ఏకాకిగా ఉంటున్న సుభద్రమ్మకు క్షయవ్యాధి అంకురించి, వైద్యంలేక ముదిరిపోయింది.

కానీ ఆ కన్న తల్లిగుండెల్లో నిక్షిప్తమై వున్న మమతానురాగాలను అరికట్టలేక లేని


## సూర్యుడు పరిశ్రమలు నడుపుతాడా ?

సూర్యుడు ఒక్కరే — వెలుగులు వెయ్యి
అదిసరే: పగటిపూట బాగానేవుంది — రాత్రిపూట మన గతేమిటి?
పగలేమిటి, రాత్రేమిటి? విద్యుచ్ఛక్తి — ఆధునికయుగంలో అన్నివేళలా అవసరమే
—: అదే మన జీవితానికి వెలుగు :—

**పగలు సూర్యుడుంటే మాత్రం పరిశ్రమలు నడుపుతాడా ?**
**ఉక్కపోసి చస్తుంటే ఫ్యాన్ తిప్పగలుగుతాడా ?**

నాలుగో ప్రణాళికలో విద్యుచ్ఛక్తి కేటాయింపు రూ. 176 కోట్ల 28 లక్షలు.
5 వ ప్రణాళికలో రూ. 455 కోట్లు.
మన రాష్ట్రంలో 4వ ప్రణాళిక చివర్లో 10,700 గ్రామాల్లో విద్యుచ్ఛక్తివుంది.
5 వ ప్రణాళిక కాలంలో ఇంకా 6 వేల గ్రామాలకు వస్తుంది.

సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

No : 277/C3/Advt. /75; Dated : 16-1-1975.

పత్తువను కూడదీసుకొని, ఓపికగా పెదబాబు ఇంటికి వెళ్ళింది, కడసారిగా కొడుకును చూడాలనే ఆకాంక్షతో. విద్య లాయర్లుగా, ఇంజనీర్లుగా తయారు చేసినా ఏం ప్రయోజనం? తల్లిని, తల్లిగా గౌరవించలేనప్పుడు? మనిషిని మనిషిగా రూపొందించే చదువు వుందని ఆ మూర్ఖులకు తెలిస్తేగా, కొంతంత ఆశతో గుమ్మంలో అడుగిడిన సుభద్రమ్మకు ఆశాభంగమే జరిగింది. తల్లిని చూస్తూనే, పెదబాబు వేగంగా బయటకు వచ్చి, ఇంటి వెనుకగా వున్న పాక దగ్గరకు తీసికొని వెళ్ళాడు. జరుగుతున్న దేమిటో వూహించేలోగానే పెదబాబు, తన జేబులో నుండి వంద రూపాయల కాగితాలను కొన్నిటిని బయటకు తీసి తనను ఎవరైనా గమనిస్తున్నారేమోనని కంగారుగా అటూ, ఇటూ చూస్తూ, ఆ డబ్బును సుభద్రమ్మ చేతిలో కుక్కాడు.

"ఎందుకు వచ్చావమ్మా, నువ్విక్కడకు? మేము గౌరవప్రదమైన జీవితం గడపడం నీ కిష్టం లేదా? నిన్నిలా ఎవరైనా చూస్తే నా విలువ ఏమౌతుందో గ్రహించావా. చిన్నవాడే నీకు బరువనిపించి ఒక అయ్య చేతిలో పెట్టి నీ భారాన్ని వదిలించుకొని చేతులు దులుపుకున్నప్పుడే నీ మాతృస్థానాన్ని దూరం చేసుకున్నావు. అవన్నీ త్రవ్వుకొని నా కాలాన్ని వృథా చేయదల్చుకోలేను. నీ కంటి పాపలా కాపాడుకొన్న తమ్ముడున్నాడుగా, వాడినే ఆశ్రయించు అంటూ ప్యూన్‌ను పిలిచి రిక్షా ఎక్కించమని చెప్పి ఇంటి లోపలకు వెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

వెర్రి చూపులు చూడటం మినహా సుభద్రమ్మ ఏమీ చేయలేక, నోటిమాట రాక నిలబడి పోయింది. చేతిలో కాగితాలు తడిలాయి. ఆ క్షణాన వాటిని ముక్కముక్కలుగా చేసి వెదజల్లా లనిపించింది. తన విలువ అయిదు వందలు. ఎండనక, వాననకా, కాయ కష్టంచేసి, బిడ్డల పొట్టలు నింపిన తల్లిని, తల్లిగా చెప్పుకోడానికి ఈ మూర్ఖులు సిగ్గు పడుతున్నారు. వీరిలో మానవత్వం మిగిలి వుంటేగా. చిన్నవాడి దగ్గరకు వెళ్ళాలనే కోర్కెను బలంగా అణచుకొంది సుభద్రమ్మ అక్కడకు వెళ్తే ఇంకెంత అవమానం జరుగుతుందోనని.

మనోవ్యాధికి మందేలేదుగా. అప్పటినుండి దిన దినానికి సుభద్రమ్మ ఆరోగ్యం క్షీణించి పోతూ మరి కోలుకోలేకపోయింది గుండెల్లో పోటు ఆరంభమై నెమ్మదిగా ఎక్కువ కాసాగింది. గతాన్నుండి బయటపడ్డ సుభద్రమ్మ బాధతో మెలికలు తిరగ సాగింది

* * *

అరచినా, గీపెట్టినా చుట్టు ప్రక్కల తన గోడు వినే వారెవ్వరున్నారు మూలుగుతూ మిగతా కళ్ళు మూసుకుంది సుభద్రమ్మ. కొంత సేపటికి ఎవరో తనను తట్టుతున్నట్లుగా అనిపించగా, మెల్లగా కనులు తెరవడానికి ప్రయత్నించింది. "అమ్మా, అమ్మా ఏమయింది? అని అడుగుతున్నారెవరో. "అమ్మ" అన్న పదం చెవుల బడగానే సుభద్రమ్మలో ఎక్కడలేని సత్తువ వచ్చింది. ఆశగా కళ్ళు తెరచింది తన కొడుకు వచ్చాడేమోనని. కాని ఆ వచ్చిన వ్యక్తిని చూసి నివ్వెరపోయింది. అతడు ఆ మురికిపేటలో పేరుగాంచిన రౌడి, దొంగ, జూదరి, వ్యభిచారి. నీతి, నిజాయితీలేని అల్పుడు. ఆ పేటలో రంగడ్ని గురించి అందరూ అనుకునే మాటలే. సుభద్రమ్మ రంగడ్ని గురించి విని వుండుటచేత, ఆ నిముషంలో రంగడ్ని తన దగ్గర చూస్తుంటే నమ్మలేకపోయింది.

సుభద్రమ్మను చూస్తూనే రంగడు ఏమనుకున్నాడో యేమో, మెల్లగా తన ఆసరాతో లేవనెత్తి తన వొడిలో తలపెట్టుకు కూర్చున్నాడు. సుభద్ర ప్రేమగా రంగడి చెయ్యి నిమురసాగింది.

"నీవాళ్ళు ఎవరైనా వుంటే వెళ్ళమ్మా,

నేను ఇప్పుడే తీసుకువస్తాను. కడసారిగా చూసుకుందువుగాని" అంటూ వత్తిడి చేయ పోగాడు రంగడు

పేలవంగా నవ్వింది సుభద్రమ్మ "నావాళ్ళు ఎవరూ లేరయ్యా. చెప్పలేక చెప్పి కన్నీరు కార్చసాగింది

"అలా అనకమ్మా. నేను నీ దగ్గరే వుంటాను. నాకూ ఎవ్వరూ లేరూ. దొంగనైనా, ఎంత చెడ్డవాడినైనా, నాలో మనసూ, మానవత్వమూ మిగిలివున్నాయి. చిన్న వయసులోనే మా నాన్న నన్నూ, అమ్మనూ అనాథలుగా వదిలి ఎటో వెళ్ళిపోయాడమ్మా. అప్పటినుండి జబ్బుతో మంచం పట్టిన మా అమ్మను కూలి చేసి అడుక్కొని కూడా పోషించాను కానీ, ఏం లాభం ఒకనాడు నేను దగ్గర లేనప్పుడు గుండెనొప్పి తినబడి ఎంతో నరక యాతన అనుభవించి నా కోసం కొట్టుకలాడి చివరకు దిక్కులేని చావు చచ్చిపోయింది. నేను వచ్చేసరికి అంతా ముగిసిపోయింది దిక్కూ, మొక్కూ లేని వారందరినీ ఈడ్చి పారవేసినట్లే మా అమ్మనూ ఈడ్చేశారు ఆ సంఘటన నా మనస్సులో నుండి ఎప్పటికీ చెరిగిపోలేదమ్మా. అందుకే దీనావస్థలో వున్న వారికి, నా చేతనయిన సాయం చేస్తుంటాను. నిన్ను చూడగానే, నా తల్లి గుర్తుకు వచ్చి నిన్ను వదలలేక వుండిపోయాను. న్యాయంగా బ్రతకాలని ఎంత చూసినా ఈ సంఘం నన్ను తరిమి కొడుతూనే వుంది. కన్నతల్లి విలువ నాకు బాగా తెలుసమ్మా. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. నా మాట నమ్మమ్మా", అంటూ రంగడు సుభద్రమ్మను ఊరడించి. కన్నీరు తుడిచాడు

రంగని మాటలు విన్న సుభద్రమ్మ పొంగిపోయింది బదులు చెప్పలేక. దాహం అంటూ సైగ చేసింది. రంగడి చేత మీదుగానే రెండు గుక్కల నీళ్లు మ్రింగి తృప్తిగా రంగడి వొడిలోనే శాశ్వతంగా కన్ను మూసింది సుభద్రమ్మ. ఏ సంబంధమూ లేని సుభద్రమ్మ కోసం రంగడు ఎంతో విలపించి కర్మ కాండలన్నీ తనే జరిపించాడు. ఎవరికెవరో; లోకం తీరు ఇంతేనా? అంతస్థులనే కృత్రిమ పంజరంలో చిక్కుకుపోయిన మనుషులు, మమతలను, అనుబంధాలను తమలోనే అణచివేసుకుంటారు కాబోలు. మండుతున్న చితిని చూస్తూ రంగడు తనలో తానే గొణుక్కున్నాడు.

★

## పరివర్తనం

ఆశతో జీవించాలి
అవరోధాలను ఛేదించాలి
ఆత్మ స్థైర్యాన్ని ఆశ్రయించాలి
ఆనందాన్ని పంచివ్వాలి
కాలం నిరంతరం సాగే ప్రవాహం
ఆగదు మనకోసం క్షణకాలం!
ప్రయత్నించి పయనించాలి సుందర
భవిష్యత్తులోకి....
ప్రచండ దుష్టశక్తులను బహిష్కరించాలి
ప్రబలిపైబడిన విషనాగులను ఖండించాలి
భావి తరాలకు మార్గదర్శకం కావాలి
భవిష్యత్తును పూలబాటగా మార్చాలి.

—మునేరి బాలరాజు